ప్రజాశక్తి
మంగళవారం 14 మే 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

ఓటెత్తారు..!

- విశాఖ, అనకాపల్లిల్లో పోలింగ్ ప్రశాంతం
- ఓటు హక్కు వినియోగించుకోవడంలో మహిళలే ముందంజ
- అనకాపల్లిలో 70.37 శాతం, విశాఖలో 60 శాతం పైచిలుకు ఓటింగ్
- ఇవిఎంల్లో అభ్యర్థుల భవిష్యత్తు నిక్షిప్తం

విశాఖలోని జాలారిపేటలో బారులు తీరిన ఓటర్లు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం ప్రశాంతంగా పోలింగ్ సాగింది. ప్రారంభంలో పలుచోట్ల ఇవిఎం మెషిన్లు మొరాయించినా వాటిని సాంకేతిక నిపుణులు సరిచేయడంతో పోలింగ్ యథావిధిగా కొనసాగింది. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లకు సౌకర్యాల కల్పనలో అధికార యంత్రాంగం విఫలమైంది. గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బారులు తీరిన ఓటర్లు

ఓటేసిన ఆనందంలో విశాఖ యువతులు

అనకాపల్లిలో..

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పురుషులు కంటే మహిళల పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ఆరు నియోజకవర్గాల్లో 70.37 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 9.30 గంటలకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలోని 12,89,371 మంది ఓటర్లలో 9,07,336 (70.37 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 6,27,321 మంది పురుషుల్లో 4,36,273 (69.55 శాతం) మంది, 6,62,022 మంది మహిళల్లో 4,71,050 (71.15 శాతం) మంది, థర్డ్ జండర్ ఓటర్లు 28 మందిలో 13 (46.43 శాతం) మంది ఓటును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ సమయం కంటే ముందుగానే ఓటర్లు క్యూలో నిల్చొన్నారు. సాయంత్రం ఆరు గంటల్లోపు క్యూలోవున్న వారికి ఓటు వేసే అవకాశం అధికారులు కల్పించారు. కొన్నిచోట్ల రాత్రి 9.30 గంటల తరువాతా పోలింగ్ సాగింది. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి కోడూరు పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించారు. కలెక్టరేట్‌లోని విసి హాల్‌లోని వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల నిర్వహణను మిగతా 2లో..

నిరాశ్రయులు.. స్ఫూర్తినింపారు

వార్త 8లో..

ఐక్య పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

వార్త 8లో..

రోడ్డు దాటాలంటే భయం

వార్త 8లో..

రాత్రి వేళ జోరువానలోనే సాగుతున్న వాహన రాకపోకలు

విశాఖలో జోరు వాన

విశాఖలో సోమవారం సాయంత్రం జోరు వాన కురిసింది. మద్దిలపాలెం, బీచ్ రోడ్డు, ఆరిలోవ, ద్వారకానగర్, హనుమంతువాక, ఎంవిపి.కాలనీల్లో కురిసిన ఈ వానతో రోడ్లు జలమయంగా మారాయి. వాహనదారులు వానలోనే రాకపోకలు కొనసాగించారు. కొన్నిచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లాయి

విశాఖ - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

వేసవి రద్దీ నియంత్రణకు రైల్వే చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మే 14, 15 తేదీల్లో విశాఖపట్నం - సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్ నిర్ణయించింది. ఈ క్రమంలో 08589 విశాఖపట్నం - సికింద్రాబాద్ వేసవి ప్రత్యేక రైలు మే 14 మంగళవారం సాయంత్రం 16.15 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 08590 సికింద్రాబాద్ - విశాఖపట్నం వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌లో మే 15 బుధవారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరి రాత్రి 23.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లె, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా ప్రయాణిస్తాయి.

రాయగడ, సంబల్పూర్ మీదుగా ఎస్ఎంవిటి బెంగళూరు - ఖుర్దా రోడ్ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

వేసవి కాలంలో ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, రైల్వే శాఖ ఎస్ఎంవిటి బెంగళూరు - ఖుర్దా రోడ్ - ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య రాయగడ సంబల్పూర్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు 06253 ఎస్ఎంవిటి బెంగళూరు - ఖుర్దా రోడ్ సమ్మర్ స్పెషల్ రైలు మే 21న మంగళవారం రాత్రి 23.00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 17.48 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 17.50 గంటలకు బయలుదేరి రాయగడ - సంబల్పూర్ మీదుగా ప్రయాణించి గురువారం 11.00 గంటలకు ఖుర్దా రోడ్డుకు చేరుకుంటుంది. 06254 ఖుర్దా రోడ్ - ఎస్ఎంవిటి బెంగళూరు సమ్మర్ స్పెషల్ రైలు మే 23 గురువారం మధ్యాహ్నం 13.00 గంటలకు ఖుర్దా రోడ్‌లో బయలుదేరి రాయగడ సంబల్పూర్ మీదుగా ప్రయాణించి శుక్రవారం ఉదయం 04.58 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా ఉదయం 05.00 గంటలకు బయలుదేరి శుక్రవారం రాత్రి 22:40 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది.

ఈ రైళ్లు కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, కేజీగూడ, ముగ్గురిగుడ, కె.బలంగిర్, బర్గా రోడ్, సంబల్పూర్, రైరాఖోల్, అనుగుల్, ధెంకనల్, కటక్, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తాయి

మొదటి పేజీ తరువాయి..

కృష్ణా కాలేజీ పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటెత్తారు..!

పర్యవేక్షించారు. ఎస్పీ కెవి.మురళీకృష్ణ, ఎఎస్‌పి బి.విజయభాస్కర్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సమయంలో ఎటువంటి అల్లర్లూ జరగకుండా సిబ్బందిని అప్రమత్తంచేశారు. పోలీసు అధికారులు తీసుకున్న జాగ్రత్తలతో పోలింగ్ సజావుగా జరిగింది. మాడుగుల నియోజకవర్గంలోని దేవరాపల్లి మండలం తారువ, కె.కోటపాడు మండలం చౌడువాడలో ఇటీవల వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య జరిగిన అల్లర్లతో పోలింగ్ సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. వివాదాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. చోడవరం మండలంలోని గవరవరంలో ఇవిఎం రెండుగంటల పాటు పనిచేయకపోవడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. చోడవరం మండలంలోని గౌరీపట్నంలో టిడిపి, వైసిపి యువకుల మధ్య గొడవ జరిగింది. అచ్యుతాపురం మండలం, మోసయ్యపేటలో వైసిపి, కూటమి పార్టీల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. పాయకరావుపేట వైసిపి అభ్యర్థి కంబాల జోగులు మెడలో పార్టీ కండువా, వాహనానికి జెండా కట్టుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లడంపై టిడిపి అభ్యర్థి వంగలపూడి అనిత జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టికి ఫిర్యాదుచేశారు. పూడిమడకలో తెల్లవారుజామున 4.30 గంటలకు పోలింగ్ కేంద్రానికి ఓటర్లు చేరుకున్నారు.

జిల్లాలోని మాడుగుల, పాయకరావుపేట, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి నియోజకవర్గాల నుంచి 54 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు బరిలో వున్నారు. అనకాపల్లి లోక్‌సభకు 15 మంది పోటీలో వున్నారు. వీరి రాజకీయ భవిష్యత్ ఇవిఎంల్లో నిక్షిప్తమై వుంది.

విశాఖపట్నంలో

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖ జిల్లాలో కడపటి వార్తలందేసరికి 60 శాతానికి పైచిలుకు ఓటింగ్ నమోదైంది. రాత్రి 11.30కి కూడా అధికార యంత్రాంగం పూర్తి వివరాలు వెల్లడించలేదు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ సాగింది. వేకువజామునకే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఇవిఎంల మొరాయింపు పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 6.30 గంటలకే నగరంలోని తూర్పు, ఉత్తర, దక్షిణం, పశ్చిమం, భీమిలి సెగ్మెంట్ల పరిధిలోగల బూత్‌ల వద్ద జనం కనిపించారు. ఉదయం ఓటు వేసేస్తే రోజంతా మిగతా పనులు చూసుకోవచ్చని భావించారు. కానీ పదుల సంఖ్యలో ఇవిఎంలు మొరాయించాయి. ఇలాంటి పరిస్థితుల్లో గంటల తరబడి నిరీక్షించిన ఓటర్లు విశాఖలో పలు కేంద్రాల నుంచి వెనక్కి రావడం కనిపించింది. సాగర్ నగర్ మేరీస్టెల్లా స్కూల్‌లో 345 బూత్‌లో ఉదయం 7 గంటలకే ఓటర్లంతా వెళ్లినా ఇవిఎం మెషిన్ మొరాయించింది. 9 గంటల వరకూ ఓటర్లు నానా అవస్థలు పడ్డారు. పోలింగ్ సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఇక్కడ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు సమాచారం తెలిసిన వెంటనే టెక్నీషియన్‌ను పంపించారు. ఆ తర్వాత మెషిన్ రిపేరు అయ్యాక పోలింగ్ 9 గంటల తర్వాత మొదలైంది. గాజువాక హైస్కూలులో 199వ పోలింగ్ స్టేషన్‌లో 10 గంటలు దాటినా పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఉత్తరంలో కొన్ని బూత్‌లలో ఇవిఎం మిషన్‌లు మొరాయించడంతో ఓటు వేసేందుకు ప్రజలు పడిగాపులు కాశారు. వృద్ధులు, వికలాంగులు చాలా అవస్థలు పడ్డారు. ఓటు వేసి వెళ్లాలన్న ధృడ సంకల్పంతో ఉందామన్నా ఇవిఎంలు సహకరించకపోవడం వీరిని కలచివేసింది. పిఎం పాలెం గ్రీన్‌డేల్ పోలింగ్ బూత్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. 8 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. యువత తమ ఓటు హక్కును తొలిసారి ఎక్కువుగా వినియోగించుకోవడం కనిపించింది. తాము మొదటిసారి ఓటు వేస్తున్నామంటూ క్యూ లైన్లలోనే పలువురితో సంభాషించడం కనిపించింది. పోలింగ్ బూత్‌ల్లోకి పలువురు యువకులు ఉత్సాహంగా వెళుతూ ఓటు వేసి బయటకొచ్చారు.

సూచికలు లేక గందరగోళం

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక ఆటోనగర్ డి.బ్లాక్‌లోని రత్నాజీ మెమోరియల్ హాల్‌లో ఏర్పాటు చేసిన 120వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఓటింగ్ కంపార్టుమెంట్‌లో సూచికలు లేక గందరగోళ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఓటింగ్ కంపార్టుమెంట్ అంటూ వేర్వేరుగా సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆయా పోలింగ్ కేంద్రంలోని సిబ్బంది అలా చేయకపోవడంతో బ్యాలెట్ యూనిట్‌లోని సీరియల్ నెంబరునే గుర్తు పెట్టుకుని ఓటింగ్‌కు వెళ్లిన కొందరు ఓటర్లు అవగాహనాలేమితో ఒక నెంబరుకు బదులు మరో నెంబరుకు ఓటేసే పరిస్థితి ఉందని అంటున్నారు. అధికారుల నిర్వాకం వల్ల పోటీ అభ్యర్థుల్లో ఒకరికి పడాల్సిన ఓటు మరొకరికి పడే పరిస్థితీ లేకపోలేదని అంటున్నారు. ఇదే పరిస్థితి విశాఖలోని పలు నియోజకవర్గాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

దక్షిణంలో ప్రశాంతంగా పోలింగ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఎటువంటి గొడవలూ, అల్లర్లూ లేకుండా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కావడంతో అప్పటికే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం కనిపించింది. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉదయం 11 గంటలలోపునే అధిక శాతం మంది ఓట్లు వేశారు. ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు పోలింగ్ కేంద్రాలలో తక్కువ మంది ఓటర్లు కనిపించారు. ఆ సమయంలో ఓట్లు వేయడానికి వచ్చిన వారు వచ్చిన కొద్ది నిమిషాలకే తమ ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితి దాదాపు అన్ని బూత్‌లలో కనిపించింది. వైసిపి దక్షిణ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తన తల్లి అమ్మాజీ, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి 27వ వార్డు రాజేంద్రనగర్‌లోని టివిఎస్‌రావు శ్రీకృష్ణ విద్యా మందిర్ బూత్ నెంబర్ 216లో సుమారు 20 నిమిషాల పాటు క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటు అనేది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని తెలిపారు. సేవ చేసే వారిని, మంచి వ్యక్తులను ఎందుకునేందుకు ఓటు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. గణేష్ కుమార్ సతీమణి ఉషారాణి, కుమారులు సూర్య, గోవిందు సాకేత్, కోడలు సౌందర్య రాసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన నియోజవర్గంలోని వివిధ వార్డులలో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు కొంతమంది అనుచరులతో కలిసి వెళ్లారు. ఇదిలా ఉండగా ప్రజాశాంతి పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి కెఎ.పాల్ రైల్వే న్యూ కాలనీలోని మున్సిపల్ మహిళా పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి వచ్చి పాత నగరం 2 వీధిలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన వైసిపి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

అల్లిపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, అలాగే దొండపర్తిలోని మున్సిపల్ పాఠశాల బూత్‌ల వద్ద చిన్న చిన్న టెంట్లు వేశారు. అయితే ఈ రెండు చోట్ల ఓటర్లు బార్లు తీరటంతో ఎండలో అరగంటసేపు నిలుచొని ఓట్లు వేసే పరిస్థితి కనిపించింది.

ఇదే పరిస్థితి 36వ వార్డు దుర్గాలమ్మ గుడి వీధి ప్రాంతంలో కూడా కనిపించింది. ఎవిఎన్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వంటి ప్రాంతాలలో పోలింగ్ బూత్‌లు అధికంగా ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల సౌకర్యాలు మెరుగ్గా ఉండడంతో ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకూ గురి కాలేదు. ఓటర్లకు ఎన్నికల కమిషన్ ద్వారా ఓటర్ స్లిప్పులు అధికంగా లభించడంతో పోలింగ్ బూత్‌ల వద్ద ప్రధాన పార్టీల తరపున 200 అడుగులకు దూరంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఓపెన్ శిబిరాలకు అంతగా పని లేకుండా పోయింది.

శ్రీభరత్ (టిడిపి విశాఖ ఎంపీ అభ్యర్థి)

విమల (సిపిఐ విశాఖ పశ్చిమ అభ్యర్థి)

బూడి ముత్యాల నాయుడు (వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి)

సత్యారెడ్డి (కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి)

ఓటేసిన అభ్యర్థులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలు పార్టీల అభ్యర్థులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో పర్యటించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఓటర్లను పలకరిస్తూ ముందుకు సాగారు.

తూర్పులో మొరాయించిన ఇవిఎంలు

సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గంలో పలుచోట్ల ఇవిఎంలు మొరాయించాయి. కృష్ణ కళాశాల, ఆంధ్ర యూనివర్సిటీ, అరిలోవ, ఎంవిపి.కాలనీలోని పలు కేంద్రాల్లో ఓటింగ్ మందకొడిగా సాగింది. ఉదయం 7 గంటలకే ప్రారంభం కావలసిన ఓటింగ్ ప్రక్రియ పలు కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించడంతో 15 నుంచి 20 నిమిషాల ఆలస్యంగా సాగింది. ఆంధ్ర యూనివర్సిటీలోని బూత్ నెంబర్ 121లో గంటన్నర ఆలస్యంగా 8:30 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఇవిఎం మెషిన్లపై కొంత మంది పోలింగ్ సిబ్బందికి అవగాహన లేని కారణంగా పలు కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభ సమయంలో ఒక్కొక్క ఓటు నమోదు కావడానికి సుమారు 4 నుంచి 8 నిమిషాల సమయం పట్టింది. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తామని చెప్పుకొచ్చిన జిల్లా ప్రభుత్వ యంత్రాంగం చేతల్లో మాత్రం పూర్తిగా విఫలమైంది. ఎండ వేడిమి తాళలేక పలువురు ఓటర్లు ఓటు వేయకుండానే వెనక్కి వెళ్లిపోయారు. వయోవృద్ధులకు, మహిళలకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పిన జిల్లా యంత్రాంగం కనీసం వారికి కుర్చీలు కూడా కేటాయించలేని పరిస్థితి కనబడింది. అనారోగ్య బాధితులు సైతం క్యూ లైన్లలో అవస్థలు పడ్డారు. మంచినీళ్లు, షామియానాలను సైతం ప్రభుత్వం తగినంతగా ఏర్పాటు చేయలేదు. ఓటు వేసేందుకు ఒక్కొక్కరికీ సుమారు ఒక గంట నుంచి మూడు గంటల సమయం పట్టింది. పలు కేంద్రాల్లో సాయంత్రం 6 తర్వాత క్యూ లైన్‌లో ఉన్నవారికి టోకెన్‌లు జారీ చేసి ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

ఓటేసిన ప్రముఖులు

తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఎంవిపి.కాలనీ సెక్టార్ 5, సెవెంత్ డే స్కూల్‌లో మాజీ మంత్రి, కూటమి బలపరిచిన టిడిపి భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల అరిలోవలోని పోలింగ్ బూత్ నెంబర్ 22లో తన ఓటును వినియోగించుకున్నారు, తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ లాసన్స్ బే కాలనీలోని పోలింగ్ బూత్ నెంబర్ 132లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ చిన వాల్తేర్ ప్రైమరీ స్కూల్-2లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తూర్పు నియోజవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అరిలోవలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్, విశాఖ జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి ఎ.మల్లికార్జున చిన వాల్తేరులోని కొటక్ సెలేసియన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 175వ నెంబరు పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేశారు. జివిఎంసి ఎడిసి కెఎస్.విశ్వనాథన్ ఏయూ ఇంగ్లీషు మీడియం స్కూల్ పరిధిలోని పోలింగ్ కేంద్రంలో సతీసమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నరు.

పోలైన దొంగ ఓటు

కృష్ణా కాలేజీలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ నెంబర్ 238లో ఒక ఓటు రిగ్గింగ్ కాగా మహిళకు ప్రత్యేక ఓటు కల్పించి ఆమె ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు

మందకొడిగా పోలింగ్

పలుచోట్ల ఇవిఎంల మొరాయింపు

గంటల కొలది క్యూ లైన్లలో ఓటర్లు

కొన్నిచోట్ల టెంటులు లేక ఎండలో ఇబ్బందులు

భీమిలి ఎంఎఫ్‌సి పాఠశాల వద్ద క్యూలో నిలబడి ఉన్న ఓటర్లు

ప్రజాశక్తి -యంత్రాంగం

చెదురు మదురు ఘటనలు మినహా సోమవారం విశాఖ నగరంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు, మరికొన్ని చోట్ల వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల పోలింగ్ మందకొడిగా సాగింది.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో వార్డు జెడ్‌పి బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, చిట్టివలస జివిఎంసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హైస్కూల్ వద్ద ఏర్పాటుచేసిన 146, 147, 153, 155, 148 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటలకే ఓటర్లు బారులు తీరారు. 155వ పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు కొంత సమయం అంతరాయం ఏర్పడింది. వృద్ధులు గంటల తరబడి నిల్చోవడానికి ఇబ్బందిపడ్డారు. జివిఎంసి మూడో వార్డు పరిధిలోని భీమిలి సిబిఎం, సెయింట్ ఆన్స్ ప్రాథమిక పాఠశాలల వద్ద, ఎంఎఫ్‌సి యుపి, ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల వద్ద ఏర్పాటుచేసిన 174, 175, 176, 181, 183, 186, 187 పోలింగ్ కేంద్రాల వద్ద చాంతాడులా ఓటర్లు క్యూ లైన్‌లో నిలబడ్డారు. పోలింగ్ మందకొడిగా సాగింది. క్యూలైన్‌లో వృద్ధులు ఇబ్బంది పడ్డారు. భీమిలి మండలం రేఖవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన 160 పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది.

జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో 147 నంబర్ పోలింగ్ కేంద్రం వద్ద ఎండలోనే ఓటర్లు క్యూలైన్‌లో నిలబడి ఇబ్బంది పడ్డారు. జివిఎంసి మూడో వార్డు పరిధి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన 183 పోలింగ్ కేంద్రం, ఎంఎఫ్‌సి యుపి పాఠశాలల వద్ద 186, 187 పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో షామియానాలు లేక పోవడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఎంఎఫ్‌సి యు పి పాఠశాల వద్దకు ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్ రమణమ్మకు ఫిట్స్ రావడంతో పడిపోయింది. ఆశా వర్కర్, హెల్త్ వర్కర్ సపర్యలు చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత అధికారులు తాగు నీటి సదుపాయం కల్పించినప్పటికీ వందల సంఖ్యలో వచ్చిన ఓటర్లకు క్యాన్ల ద్వారా ఏర్పాటుచేసిన తాగు నీరు ఎటూ చాలలేదు. దీంతో ఎంఎఫ్‌సి యు పి పాఠశాల, సిబిఎం హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన 187, 174,175 పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు బాటిళ్లతో తాగునీరు పట్టు కోవడం కనిపించింది.

ఆసక్తి చూపిన యువ ఓటర్లు..

పలు పోలింగ్ కేంద్రాల వద్ద యువ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి కనబరిచారు. సిబిఎం హైస్కూల్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జివిఎంసి హైస్కూల్, చిట్టివలస జెడ్‌పి బాలికల హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద అధిక సంఖ్యలో యువ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలో సాయంత్రం 6 గంటలు క్యూ లైన్‌లో ఉన్న వారికి పోలింగ్ సిబ్బంది స్లిప్పులు పంపిణీ చేసి ఓటుకు అవకాశం కల్పించారు. సాయంత్రం కరెంట్ కోత, చిరు జల్లుల వల్ల కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బంది ఎదురైనట్లు కొందరు ఓటర్లు చెప్పారు.

పద్మనాభం : మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. పాండ్రంగి గ్రామంలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రేవిడి, రెడ్డిపల్లి, అనంతవరం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు కొన్ని నిమిషాల పాటు అంతరాయం కలిగింది. మరికొన్ని కేంద్రాల వద్ద అరగంట నుంచి గంట వరకు

గాజువాకలో కిక్కిరిసిన ఓటర్లు

పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. రెడ్డిపల్లి, కొవ్వాడ, అయినాడలో ఈవీఎంల మొరాయింపుతో పోలింగ్ ఆలస్యం కావడంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. మహిళలు, యువకులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏపీ పోలీసులతోపాటు కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించాయి. మండలంలోని మద్ది, రెడ్డిపల్లి పోలింగ్ కేంద్రాలను కూటమి అభ్యర్థి గంట శ్రీనివాసరావు పర్యటించి పరిశీలించారు.

సాయంత్రం ఏడు గంటల సమయానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గాలి, వర్షం రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. సాయంత్రం ఏడు గంటలకు 60 శాతం పోలింగ్ అయినట్లు తహశీల్దార్ తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత కూడా క్యూలైన్లలో ఓటర్లు ఉన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో కొంతసేపు ఇబ్బందులు తలెత్తాయి. ఎండ ఎక్కువగా ఉండడం, పలుచోట్ల తాగునీటి సదుపాయం లేకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు సీతమ్మధారలోని పాపా హోమ్స్ పక్కన గల పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూటమి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు కుటుంబ సభ్యులతో కలిసి వసంత బాల స్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఓటు హక్కును కుటుంబ సమేతంగా వినియోగించుకున్నారు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు వడ్లపూడిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల టెంట్లు వేయకపోవడం, తాగునీరు కల్పించకపోవడంపై వివి.లక్ష్మీనారాయణ అసహనం వ్యక్తం చేశారు.

గాజువాక : గాజువాక నియోజవర్గ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు 197, 198, 199, కొత్త గాజువాక ఎంపిపి పాఠశాలలో ఉదయం 10 గంటల సమయంలో ఈవీఎంలు మొరాయించాయి. స్కూల్ చిన్నది కావడం,

మిందిలో ఓటు వేసిన అమర్‌నాథ్

మూడు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడంతో ఓటర్లు కిక్కిరిసి నిలబడాల్సి వచ్చింది. అప్పన్న కాలనీలోని 169, 170, 171 పోలింగ్ కేంద్రాలను కూడా చిన్న స్కూల్లో ఏర్పాటుచేయడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఓటింగ్ మందకొడిగా సాగింది.

కర్ణవానిపాలెం సామాజిక భవనంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. వైసిపి నాయకుడు భూపతిరాజు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడాన్ని టిడిపి నాయకులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు సద్దుమణిగించారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక నియోజకవర్గం వైసిపి ఎమ్మెలేయ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మింది హైస్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి అమర్నాథ్‌తో పాటు, ఆయన పెదనాన్న, పార్టీ సీనియర్ నాయకులు గుడివాడ అప్పల రామ్మూర్తి, అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి, తల్లి గుడివాడ నాగమణి, సోదరి సురేఖ, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూషలతీష్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేయడానికి ముందుకొచ్చారని, మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు.

గోపాలపట్నం :విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6:30 గంటల నుంచే ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కునేందుకు బారులు తీరారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేకంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. పశ్చిమ నియోజకవర్గం ప్రస్తుత ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు గోపాలపట్నం జిల్లా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మర్రిపాలెంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ములగాడ : పశ్చిమ నియోజకవర్గం పరిధి పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డులు, 14 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయాన్నే ఏడు గంటలకు ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 10 గంటలకు చాలా కేంద్రాల వద్ద ఖాళీగానే దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి మరలా పోలింగ్ బూత్‌ల వద్ద రద్దీ నెలకొంది. హిందుస్థాన్ షిప్‌యార్డ్ జూనియర్ కళాశాలలో ఎంపీ అభ్యర్థికి సంబంధించి 156వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. సుమారు గంటసేపు మొరాయించడంతో ఓటర్లంతా క్యూలో నిరీక్షించారు. గాజువాక నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు షిప్‌యార్డు హైస్కూల్‌లో ఓటును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టంగా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లోనూ 57 కేంద్రాలలో పోలింగ్ నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ కొన్నిచోట్ల 9 గంటల వరకు ప్రారంభం కాకపోవడంతో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు అసహనం వ్యక్తం

ఓటు వేసిన కెకె.రాజు

చేశారు. మండలంలోని బంటుపల్లి వారి కల్లాలు, వేములవలస కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండలంలో పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం ఐదు గంటల నుంచి ఓటర్లు పెద్ద సంఖ్యలో వచ్చారు. పెద్ద క్యూలైన్లను చూసి కొంతమంది వెనుదిరిగి వెళ్లిపోయారు. గొట్టిపల్లి పంచాయతీలో గత ఎన్నికలలో నాలుగు కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా ప్రస్తుతం రెండే ఏర్పాటుచేయడంతో తీవ్ర జాప్యం జరిగిందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

మండలంలో సాయంత్రం కురిసిన వర్షానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు చెల్లాచెదరయ్యారు. సాయంత్రం 6 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లకు పోలింగ్ సిబ్బంది నంబర్ స్లిప్పులు ఇచ్చారు. ఈలోగా వర్షం రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం పోలింగ్‌కేంద్రం వద్ద రాత్రి 8 దాటిన తర్వాత కూడా 300 మందికిపైగా ఓటర్లు బారులు తీరి ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గణబాబు

విద్యుత్ అంతరాయంతో గందరగోళం

సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గంటపాటు మండలంలోని వేములవలస, ఆనందపురం, పొడుగుపాలెం, గొట్టుపల్లి, కుసలవాడ తదితర కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

ఆరిలోవ : ఆరిలోవ పరిసర ప్రాంతాల్లోని ఐదు వార్డుల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూ కట్టారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు మాక్ ఓటింగ్ నిర్వహించారు. 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఆరిలోవ బూత్ నెంబరు 23, 24, ఆరిలోవ కాలనీ 26, 69, 37ఎ, 38, రవీంద్రనగర్ ఎస్ఐజి నగర్ 70 బూత్‌ల వద్ద సాయంత్రం 6 గంటలు దాటినా క్యూ లైన్లు కొనసాగాయి. సాయంత్రం 6 గంటలకు వచ్చిన ఓటర్లకు స్లిప్‌లు ఇచ్చి క్యూలైన్లో ఉంచారు. బూత్ నెంబరు 23, 24ల వద్ద సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత సుమారు 500 మంది ఓటర్లు క్యూలైన్లో ఉన్నారు. రవీంద్రనగర్, ఎస్ఐజి నగర్‌లో బూత్ నెంబరు 69లో ఉదయం ఇవిఎంలు రెండు గంటలపాటు మొరాయించాయి.

స్వల్ప ఘర్షణలు..

గాంధీనగర్ పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వైసిపి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని టిడిపి వర్గీయులు కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. సమాచారం తెలుసుకున్న ఆరిలోవ సిఐ గోవిందరావు వెంటనే అక్కడకు చేరుకొని విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను వేరే చోటుకు తరలించడంతో వివాదం సద్దుమణిగింది. 10వ వార్డు ఎస్ఐజినగర్‌లో సాయంత్రం క్యూలైన్లో నిల్చున్న ఓటర్లకు టిడిపి నాయకులు శీతల పానీయాలు సరఫరా చేయడంతో అక్కడ ఉన్న వైసిపి వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య కొంతసేపు వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది.

పెందుర్తి : 15 పంచాయతీలు, ఆరు వార్డుల్లో సుమారు 160 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఓటు వేసేందుకు ఓటర్లు పెద్దగా రాలేదు. ఉదయం, సాయంత్రం భారీగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజు, కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

వేపగుంట, చినముషిడివాడ బూత్‌ల వద్ద వైసిపి, కూటమి వర్గీయుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది వేపగుంటలో సిఐ రామకృష్ణ ఇరు వర్గాలను చెదరగొట్టారు.

సిబిఎం హైస్కూల్లో ఓటు వేసిన ముత్తంశెట్టి

ఓటు వేసిన పల్లా శ్రీనివాసరావు దంపతులు

ఓటు వేసిన 'ఉత్తర' కాంగ్రెస్ అభ్యర్థి రామారావు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
మంగళవారం
14 మే 2024

ఒక గులాబి.. రెండు ఓట్లు - పెదజాలరిపేట బూత్‌లో ఓటర్లకు నజరానా

ఓటెత్తిన జనం..!

కుటుంబసభ్యులతో కలిసి ఓటేసేందుకు వచ్చిన తూర్పు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి

మండుటెండలో ఆరుబయటే ఓటు వేసేందుకు పెద్దసంఖ్యలో బారులుదీరిన ఓటర్లు

సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఓటర్లు పోటెత్తారు. ఉదయం ఏడుగంటలకు ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని బారులుదీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దఎత్తున వృద్ధ ఓటర్లతోపాటు యువత, మహిళలు తరలివచ్చి ఓటేశారు. ఉదయం ఏడుగంటలకే ఓటింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పలు కేంద్రాల్లో అరగంట వరకు ఆలస్యంగా మొదలైంది, కొన్ని చోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడినప్పటికీ, అధికార యంత్రాంగం వెంటనే స్పందించి సరిచేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద అధికారయంత్రాంగం టెంట్‌లు, తాగునీరు, ప్రథమచికిత్సకు ఏర్పాట్లు చేసినప్పటికీ, ఓటర్లు చైతన్యవంతులై పోలింగ్‌కు తరలిరావడంతో ఇబ్బందులు పడక తప్పలేదు. దాదాపు అన్నిచోట్ల టెంట్‌లను దాటి ఆరుబయట ఎండలో భారీ క్యూలైన్లలో ఓటర్లు ఎండవేడికి తట్టుకోలేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా కేంద్రబలగాలతోపాటు స్థానిక పోలీసులు పటిష్టభద్రతా చర్యలు చేపట్టారు. సాయంత్రం ఆరుగంటలకే పోలింగ్ ముగియాల్సి ఉన్నప్పటికీ, క్యూలైన్లలో ఉన్నవారికి ఓటింగ్‌కు అనుమతించడంతో పలుచోట్ల 8గంటలు దాటేవరకు పోలింగ్ కొనసాగింది.

ప్రజలంతా ఓట్ల పండుగలో ఉండడంతో నిర్మానుష్యంగా మహానగరి విశాఖ ప్రధాన రహదారులు

అప్పుఘర్ కేంద్రంలో ఓట్లు వేసేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు

192వ పోలింగ్ బూత్ పరిధిలో ఓటరు స్లిప్పులు అందించే పనిలో వైసిపి మహిళా కార్యకర్తలు

మొదటిసారి ఓటేశానంటున్న యువతి

నేనూ ఓటేశానంటూ చూపుడు వేలు చూపుతున్న బామ్మ

నీ భవిష్యత్ కోసమే నేను ఓటుకు వచ్చానంటున్న మాతృమూర్తి

చేతులపై ఓటరును మోసుకొస్తున్న యువకుడు

ఓటేయడానికి వచ్చిన తల్లికి తోడుగా పిల్లలు

కృష్ణా కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఓటేసిన సీనియర్ సిటిజన్స్

ఓటేశామంటూ ఆనందం వ్యక్తం చేస్తున్న యువతులు

ఎవిఎన్ కాలేజీ కేంద్రంలో ఓటేయడానికి వచ్చిన ముస్లిం మహిళలు

నడవలేని ఓటర్లను వీల్‌చైర్లతో తోసుకొస్తున్న పోలీసులు, వాలంటీర్లు

అప్పుఘర్ జివిఎంసి స్కూల్ పోలింగ్ కేంద్రానికి పోటెత్తిన ఓటర్లు

కుటుంబ సభ్యులతో ఓట్లేసిన భీమిలి టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు


నర్సీపట్నంలో ఓటేసిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉమాశంకర్ గణేష్

కుటుంబసమేతంగా వచ్చి ఓటేసిన అనకాపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్.గంగాధర్

ఆరిలోవలో ఓటరు స్లిప్పులు, గుర్తింపు కార్డులు చూపుతున్న మహిళా ఓటర్లు

సార్వత్రిక పోలింగ్ ప్రశాంతం

పలు చోట్ల ఇవిఎంలు మొరాయింపు - గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించిన ఓటర్లు

అచ్యుతాపురం మండలంలో పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలైన్‌లో ఉన్న దృశ్యం, బుచ్చయ్యపేటలో తొలిసారి ఓటు వేసిన యువతి

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చిన్న చిన్న సంఘటనలు మినహా అనకాపల్లి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగింది. పలు చోట్ల ఈవిఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.

యలమంచిలి నియోజకవర్గంలో..

యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొదట మందకొడిగా ప్రారంభమైనా కాసేపట్లోనే ఊపందుకుంది. మున్సిపాలిటీలోని తెరువుపల్లి, తులసీనగర్‌లో పొడవాటి ఓటరు క్యూలు కనిపించాయి. ఎన్నికల సిబ్బందికి ఆహారం అందించడంలో రెవెన్యూ సిబ్బంది విఫలయ్యారు. చాలా మంది ఆకలితోనే గడిపారు. ఎన్నికల తాజా ఓటింగ్ సరళి విలేకర్లకు అందించడంలో ఆర్ఓ సిబ్బంది విఫలమయ్యారు. చాలా ప్రాంతాల్లో ఓటరు నెంబరు స్లిప్పులు అందించలేదు. స్లిప్పులు లేనివారు వారి ఎక్కడుందనే సంగతి తెలీక రెండు మూడు పోలింగ్ కేంద్రాలకు తిరగాల్సివచ్చింది.

ఓటింగ్ శాతం సరళి

ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ 9 గంటల సమయానికి యలమంచిలి నియోజకవర్గంలో 6.62 శాతం ఓట్లు పోలయ్యాయని నియోజవర్గ ఆర్ఓ అనుపమ ప్రకటించారు. ఆ తర్వాత వరుసగా 11 గంటలకు 14, 69 శాతం, 12 గంటలకు 19 శాతం, 1 గంటకు 34.16 శాతం, 3 గంటలకు 47.54 శాతం, 4 గంటలకు 50.44 శాతం పోలయ్యాయి. పోలింగ్ పూర్తయిన సమయానికి 67.98 శాతం ఓటింగ్ నమోదైంది.

మోసయ్యపేటలో చిన్నపాటి ఘర్షణ

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్దకు మత్స్యకారులు తెల్లవారు 4 గంటలకే వచ్చారు. తమకు ఓటుకు వేసే అవకాశం ఇస్తే వెంటనే ఓట్లు వేసి వెళ్తామని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నిర్ణీత వేళలకు పోలింగ్ కేంద్రాలను తెరుస్తామని అధికారులు ఓటర్లకు నచ్చ చెప్పారు. అధిక సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మోసయ్యపేట పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి, టిడిపి నాయకుల మధ్య ప్రారంభమైన వాగ్వివాదం ముదిరి చిన్నపాటి ఘర్షణకు దారితీసింది. ఘర్షణలో తెలుగుదేశం పార్టీకి చెందిన యువకుడుకు స్వల్ప గాయాలయ్యాయి. వైద్య చికిత్సల నిమిత్తం అతన్ని హాస్పిటల్కి తీసుకువెళ్లారు. అదే పోలింగ్ కేంద్రం వద్ద 11.30 గంటలకే ఓట్లు వేసేవారు లేక పోలింగ్ బూతు ఖాళీగా దర్శనమిచ్చింది. మంచినీటి సదుపాయం లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఆవ సోమవారం పోలింగ్ కేంద్రంలో మిషిన్ కొంతసేపు పనిచేయక పోవడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. గ్రామాలలో పోలింగ్ సరళిని పరిశీలించడానికి ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్, టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్దకు పరిశీలించారు.

ఓటర్లకు నమస్కారం చేస్తున్న జనసేన అభ్యర్థి పంచకర్ల

మునగపాక : మండలంలో పోలింగ్ మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్కసారిగా పెరిగింది. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు కుటుంబ సభ్యుల సహకారంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు ఎండవేడి తగలకుండా ఎన్నికల అధికారులు టెంట్లు వేశారు. వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మునగపాకలో రెండు పోలింగ్ కేంద్రాలలో ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు ఈవీఎంలు మొరాయించడంతో గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. మండల వ్యాప్తంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్, పలువురు వైసిపి నాయకులు పలు గ్రామాలలో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మునగపాకలో క్యూలైన్‌లో బారులుతీరిన ఓటర్లు

దేవరాపల్లి : ఉత్కంఠ పరిస్థితులను నడుమ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. పలుచోట్ల ఎన్నికల సమయం ముగిసిన ఓటర్లు బారులు తీరి ఉండడంతో అందరికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. వృద్ధులు, వికలాంగులు, యువత తమ ఓటు వేయడానికి తరలివచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 127 బూత్‌లో ఈవీఎం పనిచేయకపోవడంతో సుమారు గంటన్నర సేపు పోలింగ్ నిలిచిపోయింది. దీంతో ఓటర్లు పలు అవస్థలు పడ్డారు. 129, నాగయ్యపేటలోని 142 బూత్‌లలో ఓటింగ్ మందకొడిగా సాగింది. ఉపముఖ్యమంత్రి, వైసిపి అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు తన స్వగ్రామం తారువలో ఓటు వేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు దంపతులు దేవరాపల్లిలో ఓటు వేశారు. అనకాపల్లి పార్లమెంట్ కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ దేవరాపల్లిలో జరుగుతున్న ఓటింగ్ సరళని పరిశీలించారు. మాజీ జడ్పిటిసి గాలి వరలక్ష్మి రవికుమార్ దంపతులు కూడా ఓటు వేశారు.

కె.కోటపాడు : మండలంలోని 62 పోలింగ్ స్టేషన్లలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. మండలంలోని గొల్లలపాలెం, గొట్లాం, పిండ్రంగి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ కాస్తా మందకుడిగా జరిగింది. క్యూలైన్లలో ఉన్న ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం ఏడు గంటలకే మహిళలు యువకులు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. అనకాపల్లి పార్లమెంటు బిజెపి అభ్యర్థి సీఎం రమేష్, మాడుగుల తెలుగుదేశం వైసీపీ అభ్యర్థులు బండారు సత్యనారాయణమూర్తి, ఈర్లె అనురాధలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.

క్యూలైన్లలో ఉన్న చోడవరం వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ

చోడవరం నియోజకవర్గంలో..

చోడవరం : చోడవరం నియోజకవర్గంలో 74.85 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో 2,17,484 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,62,792 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గౌరీపట్నంలో టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ

చోడవరం మండలంలో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గవరవరం బూత్ నెంబర్ 35లో ఈవీఎం రెండు గంటలపాటు మొరాయించింది. గౌరీపట్నంలో టిడిపి వైసిపికి చెందిన కార్యకర్తలు పరస్పర దాడులు చేసుకున్నారు. పోలీసులు జోక్యంతో ఘర్షణ సద్దుమణిగింది. పోలింగ్ ప్రారంభం కాగానే వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంతో క్యూ లైన్లలో నిలబడి వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టిడిపి అభ్యర్థి కేఎస్ఎన్ఎస్. రాజు చోడవరం కోటవీధిలోనూ, వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ అంబేరిపురం గ్రామంలో కుటుంబ సమేతంగా ఓటు వేశారు.

బుచ్చయ్యపేట : మండలంలో చెదురు మదురు ఘటనలు మినహా ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. దిబ్బిడి 148వ బూతులో ఈవియం మొరాయించడంతో ఓటింగ్ నిలిచిపోయింది. బంగారుమెట్ట, కొండంపూడి గ్రామాల్లో చీఫ్ ఏజెంట్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణను వైసిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల రంగ ప్రవేశం చేసి చెదరగొట్టారు.

పెందుర్తి నియోజకవర్గంలో..

పరవాడ : పరవాడ మండలంలో రెండు, మూడు చోట్ల చెదురు, మదురు సంఘటనలు మినహా మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఓటర్లు మండుటెండను సైతం లెక్క చేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపారు. సాయంత్రం 6 గంటల వరకు మండలంలో సుమారు 55 శాతం వరకు పోలింగ్ నమోదైనట్లు తహశీల్దార్ గణపతిరావు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద సాయంత్రం 6 గంటల తర్వాత భారీ సంఖ్యలో ఓటర్లు క్యూ లైన్‌లో వేచి ఉన్నారు.

సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడు బూత్ నెంబర్ 64లో పెందుర్తి జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు లైనులో వున్నా ఓటర్లను కలిసి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట జనసేన జిల్లా సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల వెంకట రమణ తదితరులున్నారు.


దేవరాపల్లిలో వృద్ధుడిని మోసుకెళ్తున్న దృశ్యం

ఓటు వేసి తనువు చాలించిన వృద్ధురాలు

ప్రజాశక్తి - చోడవరం

ఓ వృద్ధురాలు ఓటు వేసి తనువు చాలించిన సంఘటన చోడవరంలో చోటుచేసుకుంది. మండల కేంద్రం గాంధీ గ్రామం పంచాయతీ సిటిజన్ కాలనీకి చెందిన జయవరపు నాగయమ్మ (89)ను సోమవారం మధ్యాహ్నం ఓటేసేందుకు ఆమె మనవడు ఆటలో అంకుపాలెం(హెచ్) మండలం పరిషత్ పాఠశాలకు తీసుకొచ్చాడు. ఓటేసిన తర్వాత పాఠశాల నుంచి బయటకు వచ్చిన వెంటనే సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడ ఉన్న ఓ ప్రైవేటు వైద్యుడు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఓటర్లు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

ఎన్నికలలో తమ ఓటు హక్కును ఎలాగైనా వినియోగించుకోవాలని ఆశయంతో ఆదివారం నుంచి తమ గ్రామాలకు ఓటర్లు తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లకు ముందుగానే వారి కుటుంబాలకు డబ్బులు ఇచ్చి ఎలాగైనా తీసుకురావాలని పార్టీలు కార్యకర్తలు తెలియజేశారు. ఓటు వేస్తే డబ్బులు రావడంతో పాటు తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసి గెలిపించడానికి అవకాశం ఉంటుందని ఎంత ఎండైనప్పటికీ రిజర్వేషన్లు దొరికినప్పటికీ వ్యయ ప్రయాసలతో వేలాది మంది ఓటర్లు తరలివచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కొంచెం ఎక్కువ మొత్తంలో డబ్బులు అందజేశారు.

సందడిగా మారిన గ్రామాలు

ఎన్నికల పుణ్యమా పట్టణాల్లో ఉన్న నివసిస్తున్న వారు తమ గ్రామాలకు వచ్చి కుటుంబ సమేతంగా చేరుకున్నారు. దీంతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. సంక్రాంతి పండగలకు రానివారు కూడా పోలింగ్ సందర్భంగా ఓట్లు వేయడానికి వచ్చి కనిపించారు. తమ పిల్లలు వచ్చారని ఆనందంతో మంచాన పడి ఉన్న వృద్ధులు ఆనందంగా గడిపారు. ఒకరినొకరు పలకరించుకొని కౌగిలించుకొని ఆప్యాయంగా మంచి చెడ్డలు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు.

ఓటర్లకు నజరానా

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎన్నికల సందర్భంగా ఓటర్లకు వైసిపి, కూటమి పార్టీల అభ్యర్థులకు సంబంధించిన కార్యకర్తలు గ్రామాల్లో ఒక్కో ఓటుకు రూ.1500 వరకు పంపిణీ చేశారు. డబ్బులుతోపాటు ఐదు కేజీల బియ్యం బ్యాగులను తిమ్మరాజుపేటలో ఎపిక చేసిన కొంతమంది ఓటర్ల అందజేశారు. మద్యం, బీర్లు ముందుగా కొనుగోలు చేసి స్టాక్ చేసి ఓటర్లకు పంపిణీ చేశారు. గుడిమడకలో కొంతమంది ఓటర్లకు తమకు డబ్బులు అందలేదని గోడు వినిపించారు.

బోసిపోయిన తాళ్లపాలెం సంత

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం వారపు సంత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ వారం జనం లేక విలవిలలాడింది. ఎన్నికల కారణంగా వ్యాపారులు, అమ్మకందారులు, కొనుగోలుదారులు పెద్దగా రాకపోవడంతో సంత బోసిపోయింది.

క్షతగాత్రులకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - దేవరాపల్లి

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, క్షతగాత్రులను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహ మూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాలం మామిడిలో ఎన్నికల బూత్ ఉండగా బూత్ పరిధిలో ఉన్న గ్రామాల్లో కొంత మందికి ఓట్లు లేకపోవడంతో పెదకోట బూత్‌కు తరలించాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. క్షతగాత్రులకు యుద్ధ ప్రాతిపదికన మెరుగైన వైద్యం అందించాలని, రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం నేత వెంకన్న తదితరులు

ప్రజాశక్తి
మంగళవారం 14 మే 2024

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-పలుచోట్ల మొరాయించిన ఇవిఎంలు, అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు

నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఎండలో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కొన్ని చోట్ల చెదురు మదురు సంఘటనలు మినహా మిగిలిన చోట్ల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రారంభంలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ సమయం ముగిసిన తరువాత కూడా ఓటర్లు క్యూలైన్‌లలో వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట, ఉద్దండపురం, బోదిగల్లం, గొడిచెర్ల, వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత, దేవవరం, అమలాపురం, డి.ఎల్.పురం తదితర గ్రామాల్లో ఓటు వేయడానికి ఓటర్లు బారులు తీరారు. మండలంలోని ఉపమాక గ్రామంలో పోలింగ్ బూత్ 202లో అత్యధికంగా ఓటర్లు ఉండటంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు గంటల కొద్ది క్యూ లైన్ లలో నిరీక్షించాల్సి వచ్చింది. క్యూ లైన్ లో నిలబడ లేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజయ్యపేటలో ఓటర్లు ఎండలో బారులు తీరారు. కొంతమంది ఓటర్లు ఎండ వేడిమికి తట్టుకోలేక గొడుగులు వేసుకున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు ఎండను సైతం లెక్క చేయకుండా పోలింగ్‌లో పాల్గొన్నారు. నక్కపల్లి ఆర్వో కార్యాలయం నుంచి పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా పరిశీలించారు. పోలింగే కేంద్రాల వద్ద వీడియోగ్రఫీ ,వెబ్ కాస్టింగ్ విధానం ఏర్పాటుచేసారు.

మొరాయించిన ఈవీఎంలు

మండలంలోని నక్కపల్లి, వేంపాడు, సిహెచ్ లక్ష్మీపురం, బంగారమ్మపేట, సిహెచ్‌బి అగ్రహారం గ్రామాల్లో పోలింగ్ ప్రారంభంలోనే సాంకేతిక లోపంతో ఈవీఎంలు మొరాయించాయి. సుమారుగా గంట నుంచి గంటన్నర పని చేయలేదు. దీంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. కొంతమంది ఓటర్లు మరలా వచ్చి ఓటు వేద్దామని వెనుతిరిగారు. అధికారులు ఈవీఎంలను సరిచేసి పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు.

ఓటు వేసిన అనిత

పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నక్కపల్లి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసారు. నక్కపల్లి , వేంపాడు, డిఎల్ పురం, రాజయ్యపేట తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళని పరిశీలించారు. పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

ఓటు వేసిన అనిత

నక్కపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ,ఓటింగ్ సరళని పరిశీలించారు .

చెదురు మదురు సంఘటనలు

మండలంలోని చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఉపమాక ,చందనాడ, వేంపాడు తదితర గ్రామాల్లో కూటమి నాయకులు, వైసీపీ నాయకుల మధ్య చిన్నపాటి తగాదాలు చోటుచేసుకున్నాయి.పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు,తగాదాలు జరగకుండా పోలీసు బందోబస్తు అంతంత మాత్రంగానే ఏర్పాటు చేసారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఒక్కరు లేదా ఇద్దరితో సరి పెట్టారు. దీంతో, పలు గ్రామాల్లో పోలీసులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసినప్పటికీ పలు గ్రామాల్లో ఓటింగ్ కొనసాగుతుంది. ఉపమాక లో పోలింగ్ బూత్ 203 లో సుమారు 200 మంది ఓటర్లు క్యూలో ఉండడంతో ,వారందరికీ సీట్లు ఇచ్చి పోలింగ్‌ను కొనసాగిస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఉదయం 11 గంటలకు 11.61శాతం, 1గంటకు 32.66శాతం, 3 గంటలకు 46.79శాతం, 4 గంటలకు 50.61 శాతం నమోదైంది.

నక్కపల్లి లో తోపులాట

నక్కపల్లి:నక్కపల్లి లో పోలింగ్ స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి వైసీపీ, టిడిపి శ్రేణులు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య పందెం విషయంపై వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగి తోపులాట జరిగింది. పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసు సిబ్బంది తక్కువగా ఉండడంతో తగదాను నివారించలేక పోయారు. బయట నుంచి పోలీసులు వచ్చి అదుపు చేశారు.

ఓటు వేసిన యువ నటుడు...

కోటవురట్ల:మండలంలో 25 గ్రామ పంచాయతీలకు

మాడుగులలో...

గాను 52 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.లింగాపురం, రామచంద్రపురం, పాములవాక, గ్రామాలలో సాయంత్రం 6 గంటలకు బారులు తీరి ఓటర్లు క్యూలో నిలుచున్నారు.వెంకటాపురం గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసులు లాఠీచార్జ్జి చేసి చెదరగొట్టారు. సాయంత్రం సమయంలో వర్షం కురవడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

అక్షాహెబ్‌పేట గ్రామానికి సంబంధించి యవనటుడు అల్లు రామకృష్ణ (రాఖీ) సోమవారం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నార. ఆ యన గతంలో పలు చిత్రాలలో వివిధ పాత్రలు పోషించారు. ప్రస్తుతం 'తుఫాన్ హెచ్చరిక ' 'బండిరా 'చిత్రాలలో హీరోగా నటిస్తున్నట్లు తెలిపారు.యువ నటుడిని చూసేందుకు గ్రామస్తులు ఎగబడ్డారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ బూతుల ఎదుట బారులు తీరారు. నర్సీపట్నం అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు, తన కుటుంబ సభ్యులతో కలిసి బాలికల హైస్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమా శంకర్ గణేష్ పెదబొడ్డేపల్లి ఆర్సీఎం పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కొత్తకోట:చెదురు మదురు సంఘటనలు మినహా

కోటవురట్లలో...

రావికమతం మండలంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 61 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు 55 వేల 399 మంది ఓటర్లు ఉన్నారు. టి.అర్జాపురం మండల పరిషత్ పాఠశాలలో కొత్తకోట పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఈవివిఎంలు కొద్ది సేపు మొరా యించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పోలింగ్ కేంద్రం వద్ద వాలంటీర్లు వైసీపీ కి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారంటూ టిడిపి కార్యకర్తలు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాజు, ఎంపి అభ్యర్థి సీఎం రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో నాయకులు వాలంటీర్‌లతో గొడవకు దిగారు. స్థానిక పోలీసులు కల్పించుకొని సర్ది చెప్పడంతో సద్దు మణిగింది. నియోజకవర్గ ప్రత్యేక పోలీస్ అధికారి డిఎస్పీ ఎల్ మోహన్‌రావు, కొత్తకోట, టి.అర్జా.పురం, రావికమతం, మేడివాడ తదితర గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సిఐ అప్పలనాయుడు ను ఆదేశించారు. జిల్లా ఫ్లేయింగ్ స్కడ్ సిబ్బంది పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.. కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.. సాయంత్రం 5 గంటల వరకూ సాగిన పోలింగ్ కు వర్షం అంతరాయము కలిగించింది..

వృద్ద ఓటర్లు ఇబ్బందులు

80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ లేదా హౌస్ ఓటింగ్ ఉన్నప్పటికీ అధికారులు అలసత్వంతో 90 ఏళ్లు పైబడిన వృద్దులు ఓటు వేయడానికి ఆర్సిఎం స్కూలుకు నడుచుకుంటూ వచ్చారు. నర్సీపట్నంలో ఏ బూతు వద్ద కనీసం వీల్ చైర్లు ఏర్పాటు చేయక పోవడంతో వికలాంగులు, వృద్దులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మాడుగుల: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం ఆరు గంటల నుండి ప్రారంభమైన పోలింగ్ వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం సమయంలో మోస్తరుగా వర్షం కురవడంతో వేచి ఉండవలసి వచ్చింది. మాడుగులలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో తెలుగుదేశం నాయకుడు పైలా ప్రసాదరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాడుగుల పోలింగ్ కేంద్రాలను ఉమ్మడి పార్టీ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యనారాయణమూర్తి సందర్శించారు. మండలంలో కొన్నిచోట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఉమ్మడి పార్టీల మధ్య కొద్దిపాటి ఘర్షణలు జరిగినప్పటికీని పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది. మాడుగుల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పోలింగ్ బూత్ నెంబర్ 30లో ఈవీఎం కొంతసేపు మొరాయించింది. సుమారు అరగంట తర్వాత ఈవీఎం మిషను పునరుద్ధరించి పోలింగ్ కొనసాగించారు.

అధికారులపై ఆగ్రహించిన అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం టౌన్ స్థానిక గర్ల్స్ హైస్కూల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ బూత్‌లలో సరైన వసతులు కల్పించకపోవడం పట్ల నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులపై ఆగ్రహించారు. ఓటర్లకు మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేదని ఈసీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు ఆయన వద్ద పోలింగ్ స్టేషన్లో సరైన వసతులు ఏర్పాటు చేయలేదన్నారు. ఉష్ణోగ్రత పెరగడంతో వృద్ధులు నానా ఇబ్బందులు పడ్డారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అయ్యన్న

కొత్తకోటలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

నిరాశ్రయులు.. స్ఫూర్తినింపారు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలోని ఎయుటిడి భీంనగర్, టివిఎస్ఆర్ డే అండ్ నైట్ షెల్టర్స్‌లో ఉన్న 102 మంది నిరాశ్రయులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వీరంతా ఎక్కడెక్కడివారో అయినప్పటికీ నైట్ షెల్టర్స్‌లో ఉంటూ ఓటు పండగ రోజున తమ హక్కును వినియోగించుకున్నారు. రానున్న కొత్త ప్రభుత్వం నిరాశ్రయులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా వారంతా స్వచ్ఛందంగా ఓట్లు వేశారని నిరాశ్రయుల సంస్థను నిర్వహిస్తున్న ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. ఓట్లు వేసిన వారిలో వికలాంగులు, ఒంటరి మహిళలు ఉన్నారని పేర్కొన్నారు.

ఓటర్లకు అభ్యర్థుల ధన్యవాదాలు

ప్రజాశక్తి-గాజువాక : ఈ ఎన్నికల్లో తనకు ఓటేసిన ఓటర్లకు, ప్రచారం చేసిన కేడర్‌కు, కష్టపడిన ప్రతి ఒక్కరికీ ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక నియోజవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్నా తాను తిరిగిన పోలింగ్ స్టేషన్లలో చాలావరకు తాగు నీటి సదుపాయం లేదని, టెంట్లు సరిగ్గా వేయలేదని తెలిపారు. ఈవీఎంలు మొరాయించడం వల్ల గంటల తరబడి క్యూ లైన్లలో ఓటర్లు నిలబడాల్సి వచ్చిందన్నారు. గాజువాకలో ప్రధానంగా అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా బహిరంగంగానే డబ్బులు పంపిణీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ గాజువాక నియోజవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. కొత్త గాజువాక ఎంపిపి స్కూల్‌లోని 197 పోలింగ్ కేంద్రం వద్ద పల్లా శ్రీనివాసరావు ఆయన భార్యతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓటింగ్ సరళిని పరిశీలిస్తే తన గెలుపు ఖాయం అన్నారు.

రోడ్డు దాటాలంటే భయం

నాతయ్యపాలెం -అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ కల నెరవేరేనా?

ప్రజాశక్తి -గాజువాక

గాజువాక నియోజకవర్గం పరిధి నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారిని దాటేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్ ఓవర్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కొన్నేళ్లుగా డిమాండ్‌చేస్తున్నారు. ఈ సమస్య కలగానే మిగిలిపోతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల ప్రజలు రోడ్డు దాటాలంటే వణికిపోతున్నారు. రోడ్డు దాటే సమయంలో ఏ వాహనం ఢీ కొట్టి చనిపోతామోనన్న భయంతోనే ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. వారికి ఈ మార్గం తప్ప మరో దారి లేదు. పాదచారులకు ఇది ఒకటే మార్గం. ప్రతిరోజూ ఉదయం నాతయ్యపాలెం నుంచి స్కూల్ పిల్లలు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్తుంటారు. సాయంత్రం తిరిగి వస్తుంటారు. అదే సమయంలో ఫార్మాసిటీకి చెందిన బస్సులు, గంగవరం పోర్టుకు చెందిన లారీలు వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతూనే తల్లిదండ్రులు స్కూల్‌కు పిల్లలను పంపిస్తున్నారు. పాత గాజువాక వెళ్లాలంటే నాతయ్యపాలెం ప్రజలు అక్కిరెడ్డిపాలెం సర్వీస్ రోడ్డుకు వెళ్లాలి. రెండు రోడ్లు దాటి వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం రోడ్డు దాటే సమయంలో అక్కిరెడ్డిపాలేనికి చెందిన రోహిణి లారీ ఢీకొని ప్రమాదానికి గురైంది. ఆరు నెలలు కోమాలో ఉంది. చాలా మంది తీవ్రగాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. పల్లా శ్రీనివాసరావు గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రమాదాల నివారణకు ఫుట్ ఓవర్ నిర్మాణం చేపట్టడమే సరైన మార్గం అని చెప్పారు. తర్వాత గాలికి వదిలేశారు. దీనిపై చాలాసార్లు సిపిఎం పోరాటాలు చేసింది. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రెండు ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

దీనిపై ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావును వివరణ కోరగా, అది ప్రమాదకరమైన జంక్షన్ అని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రజలు రోడ్డు దాటేటప్పుడు రెండు వైపులా చూసుకొని జాగ్రత్తగా దాటాలని కోరుతున్నారు.

భయం, భయంగా రోడ్డు దాటుతున్న ప్రయాణికులు

పాత గాజువాకలో...

పాత గాజువాకలో ఫుట్ ఓవర్ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు. పునాదుల వరకు పనులు కూడా చేశారు. తర్వాత వాటిని వదిలేశారు. ఈ జంక్షన్లో కూడా విపరీతమైన ట్రాఫిక్ పెరిగింది. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రదేశంలో, తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'ఉక్కు'ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : ప్రజల మద్దతుతో విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1187వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఎల్ఎమ్ఎస్‌బిఎం విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి విద్యుత్ ఆటంకం లేకుండా చేస్తే లాభాల బాటలో పయనించడం కష్టతరమైన విషయమేమీ కాదన్నారు. త్యాగాల ఫలితంగా దక్కిన విశాఖ ఉక్కును పోరాటాలతో కాపాడుకుంటామన్నారు. ప్లాంట్‌ను కారు చౌకగా కాజేయాలని చూస్తున్న కేంద్ర బిజెపి కుట్రలను ఐక్యపోరాటాలతో తిప్పికొడతామన్నారు.

అనకాపల్లి నియోజకవర్గంలో 78.96 శాతం పోలింగ్

ఓటు వేసినట్లు చూపుతున్న వైసిపి అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ

వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న తరుణ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుండే పోలింగ్ ప్రారంభం కాగా, జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే పోలింగ్ శాతం ప్రారంభం నుంచి ఎక్కువగానే నమోదు అవుతూ వచ్చింది. 9 గంటల సమయానికి గరిష్టంగా 28.54 శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటిగంటకు 46.10 శాతం, మూడు గంటలకు 60.80 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 65.40 శాతం ఓట్లు నమోదు కాగా, పోలింగ్ ముగిసే నాటికి 78.86 శాతం పోలింగ్ నమోదైంది. జనసేన కొణతాల రామకృష్ణ స్థానిక గవరపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఓటు వేశారు. అనకాపల్లి పట్టణం గాంధీనగర్ జీవీఎంసీ స్కూలులోని156 పోలింగ్ బూత్‌లో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి అనకాపల్లి జీవీఎంసీ బాలుర ఉన్నత పాఠశాలలోనూ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ అనకాపల్లిలోనూ ఓటు వేశారు. పోలింగ్ తీరును అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, మలసాల భరత్ కుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దేమునిగుమ్మంలో పోలింగ్ స్టేషన్‌ను టిడిపి రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు, మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు పరిశీలించారు. పట్టణంలోని గవర పాలెం ప్రాంతంలో శతకం పట్టు 229 బూతులో ఉదయం నుంచి ఓటింగు మందకొడిగా సాగింది. ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం అయ్యేసరికి ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వందలాదిగా ఓటర్లు నిలిచిపోవడంతో కాస్త తొక్కిసలాట జరిగింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఓటర్లకు సర్దిచెప్పి ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు.

వృద్ధురాలితో ఓటు వేయించిన ఎస్ఎఫ్ఐ నేత

ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గొర్లి తరుణ్ సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియలో అనకాపల్లి అంజయ్య కాలనీలో 86 సంవత్సరాల వృద్ధుడైన మల్ల రమణను అంజయ్య కాలనీ 189వ బూత్‌లో ఓటు వేసేందుకు మూడు చక్రాల ఛైర్‌లో తీసుకువెళ్లి ఓటు వేయించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కశింకోట మండలంలో ఘర్షణలు

కశింకోట : మండలంలోని జోగారావుపేట పోలింగ్ బూత్‌లో వైసిపి, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణలు జరిగింది, నర్సింగబిల్లి, చెరకాము, తీడ పోలింగ్ కేంద్రాల వద్ద వైస్సార్సీపీ, టీడీపీ నాయకులు మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు వారిని సముదాయించారు. పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కు వేశారు. కశింకోట మండలం ఏఎస్ పేటలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ఓటు వేశారు. ఇదే గ్రామంలో గగనం పార్వతి (92) వృద్ధురాలు ఓటు వేశారు.

ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో జరిగిన ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తన వీడియో కాన్ఫరెన్స్ హాల్ ద్వారా మానిటరింగ్ చేశారు. ముందుగా ఆయన తన ఓటు హక్కును కోడూరులో వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీ మురళీకృష్ణ వివిధ నియోజకవర్గాల్లో బందోబస్తును పరిశీలించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఓటర్లకు కావలసిన సదుపాయాలను కల్పించినట్టు తెలిపారు.

అనకాపల్లిలో ఓట్లు వేయడానికి బారులుతీరిన ఓటర్లు